అర్హులకు సత్వరమే పరిష్కారం



శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

- సంతృప్తికర రీతిలో చర్యలు తీసుకోవాలి
- మండల స్థాయి జేకేసీలో కలెక్టర్ మల్లికార్జున
- వివిధ సమస్యలపై 20 వినతులు సమర్పించిన అర్జీదారులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో జేసీ విశ్వనాథన్, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

మహారాణిపేట : జగనన్నకు చెబుదాం వేదికగా ప్రజల నుంచి వచ్చే వినతులకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని, సంతృప్తికర రీతిలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. మహారాణిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న టర్నర్ చౌల్ట్రీ కల్యాణ మండపంలో బుధవారం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. స్థానిక మక్కా మసీదు పరిధిలోని బరియల్ గ్రౌండ్ స్థలానికి ప్రత్యామ్నాయంగా మరొక చోట స్థలం ఇవ్వాలని ముస్లిం పెద్దలు వినతిపత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఆనందపురం మండల పరిధిలో ప్రత్యామ్నాయ స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కుట్టు మిషన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ పలువురు వినతులు అందించగా, తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. తాగునీటి వసతి, కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, రెవెన్యూ, జీవీఎంసీ పరిధిలోని పలు అంశాలకు సంబంధించిన 20 వినతులను స్థానికులు ఈ సందర్భంగా సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, తహశీల్దార్ ఆనంద్‌కుమార్, కార్పొరేటర్లు కొడూరు సూకరత్నం, విల్లూరి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, పార్టీ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, సర్వేశ్వరరెడ్డి, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ సెక్యూరిటీ గార్డులకు కలెక్టర్ అభినందన



సెక్యూరిటీ గార్డుకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుని, నిందితులను పోలీసులకు అప్పగించిన కేజీహెచ్ సెక్యూరిటీ గార్డులను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో పాటు ఆస్పత్రి వైద్యులు అభినందించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ గార్డులకు కలెక్టర్ జ్ఞాపికను బహూకరించారు. ఈనెల 6న సెక్యూరిటీ గార్డులు అల్లు కుమారస్వామి, రంగాల వినోద్‌కుమార్ కేజీహెచ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు మహిళల బ్యాగులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ మహిళల బాగుల్లో గంజాయి బయట పడింది. దీంతో ఆ ముగ్గురు మహిళలను సెక్యూరిటీ గార్డులు వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. మంగళవారం ఈ ఇద్దరు సెక్యూరిటీ గార్డులను నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ అభినందించారు.

క్లుప్తంగా

దుర్గాలమ్మ హుండీ ఆదాయం రూ. 14.5 లక్షలు



దుర్గాలమ్మ హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులోని దుర్గాలమ్మ ఆలయానికి రూ. 14,5,407 ఆదాయం వచ్చిందని దేవస్థానం చైర్మన్ నాయిని మల్లిబాబు, ఈవో శేఖర్‌బాబు తెలిపారు. ఇవి దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు సమర్పించిన కానుకలు అని వారన్నారు. బుధవారం ఆలయ ధర్మకర్తల మండలి సమక్షంలో హుండీ లెక్కింపు జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, ఆలయ ధర్మకర్తలు మంగరాజు, కంటిపిల్లి వరలక్ష్మి, రమణమ్మ, దశమంతుల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే విద్యార్థుల ఉన్నతి



నిర్వాహకులతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యం

దాబాగార్డెన్స్ : ఏవీఎన్ కళాశాలలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ ఓషన్ సిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అండ్ మెంటరింగ్‌పై బుధవారం సదస్సు నిర్వహించారు. సైకాలజిస్ట్ పి. రవికాంత్ విద్యార్థుల భవిష్యత్‌కు మెంటరింగ్ ఆవశ్యకత, స్టార్టప్ కంపెనీలు ప్రారంభించడానికి కావల్సిన నైపుణ్యాలు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ జీవన నైపుణ్యాలు విద్యార్థుల అభివృద్ధికి ఏ విధంగా దోహదపడతాయో వివరించారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ఓషన్ సిటీ అధ్యక్షురాలు రాజకుమారి, కార్యదర్శి భరాతి రోప్రా, కోశాధికారి సాయిలక్ష్మి, సభ్యులు స్వర్ణలత, భవ్య, కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి డి. సంతోష్‌కుమార్, ఎన్. అనంతలక్ష్మి, ప్రదీప్‌కుమార్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు



ఆకట్టుకున్న చిన్నారులు వస్త్రధారణ

దాబాగార్డెన్స్ : మహారాణిపేటలో గల ఆల్వైట్ స్కూల్ ప్రీ ప్రైమరీ చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు బుధవారం అట్టహాసంగా సాగాయి. ఈ పోటీలను పాఠశాల డైరెక్టర్ షీలాజాక్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారుల వస్త్రధారణ తీరు ఆకట్టుకుంది. పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆచారి, ప్రీ ప్రైమరీ స్కూల్ పిల్లలు, స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

సమస్యల పరిష్కారానికి వినతి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న విల్లూరి భాస్కరరావు

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. బుధవారం నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యే వాసుపల్లితో కలిసి టర్నర్ చౌల్ట్రీలో కలెక్టర్ మల్లికార్జున జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విల్లూరి భాస్కరరావు వార్డులో డాల్ఫిన్ హోటల్ నుంచి సీహార్స్ జంక్షన్ వరకు, గణేశ్వర పాఠశాల నుంచి చేపల మార్కెట్ వరకు, మున్సిపల్ స్టేడియం నార్త్ గేటు నుంచి వెలంపేట మీదుగా సీబీఎం పాఠశాల, అలాగే చేపల మార్కెట్ వరకు తారు రోడ్డు నిర్మించి ఇరువైపుల కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నూనెమిల్లు వీధిలో సీసీరోడ్డుతో పాటు కాలువలు నిర్మించాలని తెలిపారు. ఇదే వార్డులో దుర్గమాంబ, ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు జరిగి కూడా ఇప్పటికీ ప్రజలకు రిజిస్టర్ చేసిన డాక్యుమెంట్లు ఇవ్వలేదన్నారు. ఆ డాక్యుమెంట్లు త్వరగా ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

మోసాలపై విద్యార్థినులకు అవగాహన తప్పనిసరి



బహుమతులు పొందిన విద్యార్థినులతో నిర్వాహకులు

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థినులకు పోటీలు నిర్వహించారు. విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, భారతీయ జీవిత బీమా సంస్థ విశాఖ డివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యాసరచన, ఎలక్యూషన్ పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. సమాజంలో జరుగుతున్న మోసాలపై విద్యార్థినులకు అవగాహన ఉండాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం నుంచి జి. జ్యోతి, డాక్టర్ బి. నాగమణి, ఎకనామిక్స్ విభాగం నుంచి డాక్టర్ కేఎల్ శిరీష, ఐక్యూఏసీ కన్వీనర్ డి. అరుణపద్మ, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

'ఆంధ్రాకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంపై సమీక్ష



జీవీఎంసీ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : ఈ నెల 9 నుంచి ఆంధ్రాకి జగనే ఎందుకు కావాలంటే పేరిట నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి వీసం రామకృష్ణ జీవీఎంసీ అధికారులతో బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రారంభం రోజు మధ్యాహ్నం 3 గంటలకు 41వ వార్డు పరిధి 1086234 సుబ్బలక్ష్మీనగర్-2 సచివాలయం, 42వ వార్డు పరిధి 1086233 సుబ్బలక్ష్మీనగర్-1 సచివాలయం, 29వ వార్డు 1086173 దిబ్బలపాలెం (చందకవీధి) సచివాలయలో నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డీఈఈ భరణికుమార్, ఏపీడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

- 25 నుంచి 22వ పుస్తక మహోత్సవం



పుస్తక ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ-1 శ్రీనివాసరావు తదితరులు

అల్లిపురం : విశాలాంధ్ర బుక్ హౌస్ విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న విశాలాంధ్ర విశాఖ 22వ పుస్తక ప్రదర్శన ప్రచార పోస్టర్‌ను నగర శాంతి భద్రతల డీసీపీ-1 కె. శ్రీనివాసరావు ఆవిష్కరించారు. బుధవారం సాయంత్రం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రతినిధులు పీఏ రాజు, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, సభ్యులు సీఎస్ క్షేత్రపాల్‌రెడ్డి, శ్యాంసుందర్ తదితరులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాలాంధ్ర ప్రచురణ సంస్థలు తెలుగు సాహిత్య విస్తరణకు విశేష కృషి చేస్తున్నాయన్నారు. పుస్తక మహోత్సవాన్ని పుస్తక ప్రియులు, సాహితీవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



33వ వార్డులో విశ్వనాథ్ బెహరాకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



37వ వార్డులో ధనరాజు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: ప్రజాదర్బార్‌లో వైద్య సాయం కోసం వచ్చిన ఆర్జీలపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పందించారు. తన సొంత నిధుల నుంచి నలుగురికి రూ.25 వేలు అందజేశారు. 34వ వార్డు కెప్టెన్ రామారావు జంక్షన్‌కు చెందిన గిరి లక్ష్మీ భవాని పెళ్లికి ఆర్థిక సాయం అందజేయాలని ప్రజాదర్బార్‌లో ఆమె కుటుంబ సభ్యులు కోరిన మేరకు పెళ్లి ఖర్చుల కోసం రూ.10 వేలు అందజేశారు. 33వ వార్డు గౌరీస్ట్రీట్‌కు చెందిన విశ్వనాథ్ బెహరా కిడ్నీ సమస్యతో బాధపడుతూ కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉన్న దృష్ట్యా రూ.5 వేలు, 37వ వార్డు డెంకాడ వీధికి చెందిన గొండ్లు ధనరాజు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో పెద్ద కర్మ ఖర్చుల కోసం రూ. 5వేలు, ఇదే వార్డు పెయిందొరపేటకు చెందిన చింతపల్లి నూకరాజు ఇటీవల జారి పడిపోవడంతో తలకు దెబ్బ తగిలి, ఏ పని చేయలేక ఇంటికే పరిమితమై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పలు వార్డుల అధ్యక్షులు, జేసీఎస్ ప్రెసిడెంట్లు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమాని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎన్టీఆర్ అభిమానులు

దాబాగార్డెన్స్ : ఇటీవల మృతి చెందిన ఏపీ, తెలంగాణ స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ విజయనగరం జిల్లా కన్వీనర్ పిన్నింటి కృష్ణ యాదవ్ కుటుంబానికి స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్లు ఆర్థిక సాయం అందజేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో పిన్నింటి కృష్ణ యాదవ్ కుటుంబ సభ్యులకు కన్వీనర్లు సేకరించిన రూ.4.లక్షలు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా స్టేట్ వైడ్ కన్వీనర్ నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ అభిమానులకు ఎల్లప్పుడూ తమ హీరో ఎన్టీఆర్ అండదండలు ఉంటాయన్నారు. భవిష్యత్‌లో కూడా ఇబ్బందుల్లో ఉండే అభిమానులకు ఒక ట్రస్ట్ ద్వారా సహాయం చేస్తామన్నారు. అలాగే గతంలో మృతి చెందిన శ్రీకాకుళం కన్వీనర్ మన్మథరావు కుటుంబానికి కూడా చేయూత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అభిమానులు నొడగల నాయుడు, దుంగ శ్రీధర్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో సిటీవైడ్, గాజువాక స్టీల్ సిటీ ఫ్యాన్స్ సభ్యులు, గాజువాక ఎన్టీఆర్, ఎన్‌బీకే మోక్షజ్ఞ టీం సభ్యులు అప్పన్న, నాగిరెడ్డి, కనకరెడ్డి, వరహాలు, గౌరీ, గణపతి, శ్రీను, శివరాం, గోపి, చిన్నా యాదవ్, రామ్మోహన్, శ్రీను పాల్గొన్నారు.

వెంకట రమణమూర్తికి నివాళులు



రమణమూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ తండ్రి వెంకట రమణమూర్తి ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు బుధవారం దశదిన కార్యక్రమం అల్లిపురంలోని వివేకానందకాలనీలో గల వారి స్వగృహమందు నిర్వహించిన సందర్భంగా నియోజకవర్గం నాయకుడు సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, 33వ వార్డు కార్పొరేటర్ బీశెట్టి వసంతలక్ష్మి, బీశెట్టి గోపీకృష్ణ, నీలాపు విజయానందరెడ్డి, నిఖిలేష్, సర్వేశ్వరరెడ్డి, కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, శ్రీహరిరెడ్డి, ఎల్లంకి చిన్నమ్మలు, విల్లూరి చక్రవర్తి, ఏపీడీ పుణ్యవతి, సీవో రత్నం, ఆర్పీలు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

తెలుగు భాషకు 'గిడుగు' సేవలు అపూర్వం



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

తాటిచెట్లపాలెం: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో తెలుగు భాషకు గొడుగు - గిడుగు అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.వేణు ప్రసంగిస్తూ తెలుగు భాషకు.. ముఖ్యంగా వ్యావహారిక భాష ఉనికికి, వ్యాప్తికి కృషి చేసిన మహనీయుడు గిడుగు రామమూర్తి పంతులు అని కొనియాడారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఆధునిక భాషా శాస్త్రంలో అసదృశ విద్వాంసుడు, దీక్షా పరుడు, నిర్భయుడు, తెలుగు సవరల భాషల అదృష్టదీపకుడు, మహామనిషి గిడుగు రామమూర్తి పంతులు అని కితాబిచ్చారు. గిరిజన ప్రాంతాల్లో పర్యటించి సవర భాష వ్యాప్తికి కృషి చేసి నిఘంటువులను తయారు చేశారన్నారు. ఆయన కృషికి అప్పటి ప్రభుత్వం రావ్ బహదూర్ బిరుదుతో సత్కరించిందని, ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించిందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, సిహెచ్.చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, భాగవతుల సత్యనారాయణ మూర్తి, పి.గణేశ్వరరావు, గండికోట సుబ్బలక్ష్మి, పి.వి.ఆర్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మ అనుపు మహోత్సవం




విశేష అలంకరణలో దుర్గమ్మ



గరగల నృత్యం చేస్తున్న కళాకారులు

అల్లిపురం : మెయిన్‌రోడ్డులో గల శ్రీ ధనశక్తి అమ్మవారి పీఠం ఆధ్వర్యంలో అక్టోబర్ 15వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా అమ్మవారి తిరువీధి ఉత్సవం వైభవంగా చేపట్టారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అల్లిపురం మెయిన్‌రోడ్డు, సింహాలదేవివిడి, గోకుల్ థియేటర్, మార్కెట్ రోడ్డు ప్రాంతాల్లో వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, తప్పిటగుళ్లు, అమ్మవారి నృత్యం, గరగల నృత్యం, తీన్మార్ వంటి కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా రవి భవానీ భవిష్యవాణి వినిపించారు.

వాకర్స్ పార్కులో ప్రముఖుల చిత్రాలు



మురళీనగర్ వాకర్స్ పార్కులో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర ప్రముఖుల కుడ్య చిత్రాలు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ప్రముఖుల కుడ్య చిత్రాలను ఏర్పాటు చేశారు. తెల్లదొరల గుండెల్లో నిదురించిన స్వాతంత్ర్య సమర యోధుడు అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు, దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అంటూ ప్రజల్లో చైతన్య దీప్తులు నింపిన గురజాడ అప్పారావు, పదండి ముందుకు.. పదండి ముందుకు .. వస్తున్నాయ్... వస్తున్నాయ్..జగన్నాథ రథ చక్రాలు అంటూ ప్రజల్లో విప్లవ భావాలు రగిల్చి సర్వ సౌభ్రాతృత్వం, సామాజిక సమానత్వానికి కృషి చేసిన మన ప్రాంత కవి శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు), విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అంటూ నినదించి ఉక్కు ఫ్యాక్టరీని విశాఖకు సాధించిన మహనీయుడు, జై ఆంధ్ర ఉద్యమాల్లో కీలక భూమిక వహించిన నాయకుడు తెన్నేటి విశ్వనాథం, తెలుగు భాషోద్యమం ద్వారా వాడుక భాష ప్రాధాన్యాన్ని తెలిపిన గిడుగు రామ్మూర్తి పంతులు స్మృత్యంజలిగా వారి తైలవర్ణ చిత్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకు అవసరమైన ఆర్థిక సాయం వాకర్స్ డిస్ట్రిక్ట్-101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ సమకూర్చారు. నేటి తరంలో ఉత్తరాంధ్ర ప్రముఖుల వీర గాథలతో స్ఫూర్తిని నింపేందుకు ఈ చిత్రాలను ఏర్పాటు చేసినట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థికసాయం



రవితేజకు చెక్కు అందజేస్తున్న డీఆర్‌వో మోహన్‌కుమార్

మహారాణిపేట : కిడ్నీ వ్యాధితో బాధపడుతూ పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అట్టాడ రవితేజ చికిత్సకు ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఈ అభ్యర్థనకు స్పందించిన కలెక్టర్ మానవతా దృక్పథంతో సంజీవని నిధి నుంచి రవితేజకు రూ.15,000 మంజూరు చేశారు. మంజూరైన నగదును కలెక్టర్ ఆదేశాల మేరకు చెక్కు రూపంలో బుధవారం రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ రవితేజకు అందచేశారు.

రహదారి పక్కన చెత్త తొలగించండి



పందుపుల్లల సందు వద్ద చెత్త ఎత్తిస్తున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్

జగదాంబ : రహదారి పక్కన చెత్త లేకుండా శుభ్రం చేయాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.రాజేష్ అన్నారు. బుధవారం జోన్ పరిధిలోని 35వ వార్డులో పర్యటించారు. పందుపుల్లల సందు, వన్‌టౌన్ ప్రధాన రహదారి, పూర్ణామార్కెట్ ప్రాంతాలను పరిశీలించారు. రహదారి పక్కనున్న చెత్త కుప్పలను ఎత్తించి డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో రహదారులు, కాలువలు పరిశుభ్రంగా ఉండాలని వార్డు ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తే మురుగు నీరు బయటికి రాకుండా ఉంటుందన్నారు. మార్కెట్‌లో ప్రతి దుకాణం వద్ద మూడు రకాల చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేని పక్షంలో అటువంటి దుకాణదారుడికి అపరాధ రుసుము విధించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు ఏర్పాట్లు



బాణసంచా విక్రయాల కోసం మైదానంలో సిద్ధం చేస్తున్న దుకాణాలు

ఎంవీపీ కాలనీ: స్థానిక ఏఎస్ రాజా మైదానంలో బాణసంచా విక్రయాలకు ఏర్పాట్లు చకచక జరుగుతున్నాయి. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా ఈ మైదానంలో బాణసంచా విక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది 50 వరకు దుకాణాలను ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. గతంలో 70 వరకు దుకాణాలకు అనుమతులు ఇచ్చినప్పటికీ వినియోగదారుల సౌకర్యార్థం, పార్కింగ్ సౌకర్యార్థం ఈ ఏడాది 50 దుకాణాలకు జీవీఎంసీ అనుమతి ఇచ్చింది. జీవీఎంసీ అనుమతితో పాటు ఫైర్ సేఫ్టీ, విక్రయాల లైసెన్స్ పొందిన దుకాణదారులను మాత్రమే విక్రమాలకు అనుమతిస్తున్నట్లు ఎంవీపీ పోలీసులు తెలిపారు. అయితే చాలా మంది దుకాణదారులు ఈ మేరకు అనుమతులు పొందిన నేపథ్యంలో శుక్రవారం నుంచి ఈ మైదానంలో విక్రయాలు ప్రారంభం కానున్నాయి.

కార్తీక మాసోత్సవాలకు సన్నద్ధం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలోని ఉమా నీలకంఠేశ్వరాలయం కార్తీక మాసోత్సవాలకు సిద్ధమవుతోంది. ఈ కార్యక్రమాలకు బుధవారం కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పందిరి రాట వేశారు. ఈ నెల 13 నుంచి కార్తీక మాసం ప్రారంభమవుతున్న సందర్భంగా ప్రతి రోజు ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ ఈవో తెలిపారు.